ఇక 'యాంటీ రేబిస్‌ క్లినిక్‌'లు..!

కుక్కకాటు మరణాలు తగ్గించేందుకు కేంద్రం చర్యలు

- పైలెట్‌ ప్రాజెక్ట్‌గా 5 జిల్లాల ఎంపిక
- కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన
- సాధారణ రోగులతో సంబంధం లేకుండా చికిత్స


కొండాపూర్‌ జిల్లా ప్రభుత్వాసుపత్రి

గచ్చిబౌలి: రేబిస్‌ మరణాలు తగ్గించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు చర్యలు చేపట్టాయి. ఇందుకోసం 'మోడల్‌ యాంటి రేబిస్‌ క్లీనిక్‌'ల ఏర్పాటుకు సన్నద్ధమవుతోంది. కుక్క కాటు కేసులు ఎక్కువగా నమోదవుతున్న 5 జిల్లాలో 'యాంటి రేబిస్‌ క్లీనిక్‌'ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పైలెట్‌ ప్రాజెక్ట్‌గా హైదరాబాద్‌, రంగారెడ్డి, నల్గొండ, మేడ్చల్‌, సూర్యాపేట జిల్లాలను ఎంపిక చేసింది. రంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రిలో యాంటి రేబిస్‌ క్లినిక్‌ ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రతిపాదించారు. కేంద్రం ఇచ్చే నిధులతో 'యాంటి రేబిస్‌ క్లినిక్‌' ఏర్పాటు చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

సాధారణ రోగులతో సంబంధం లేకుండా..

కొండాపూర్‌ జిల్లా ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజు వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ఇప్పటివరకు సాధారణ రోగుల మాదిరిగానే కుక్క కాటు గురైన వారికి చికిత్స చేస్తున్నారు. అయితే ఆస్పత్రిలో ఏర్పాటు చేసే యాంటి రేబిస్‌ క్లీనిక్‌తో కుక్క కాటుకు గురైన వారు మాత్రమే క్లీనిక్‌ వెళ్లేలా చర్యలు తీసుకుంటారు. సిబ్బంది సూచన మేరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నల్లా(కులాయి) వద్ద రోగి గాయాన్ని శుభ్రంగా కడుక్కోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రత్యేక గదిలో ఏఆర్‌వీ (యాంటి రేబిస్‌ వ్యాక్సిన్‌) ఇంజక్షన్‌ చేస్తారు. కుక్క కరిచిన రోజు మొదటి ఇంజక్షన్‌, 3వ రోజు, 7వ రోజు, 10వ రోజు 4 ఇంజక్షన్లు డాక్టర్ల పర్యవేక్షణలోనే ఇస్తారు. యాంటి రేబిస్‌ క్లీనిక్‌లో డాక్టర్‌ పర్యవేక్షణలో స్టాఫ్‌ నర్స్‌, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. క్లీనిక్‌ నిర్వహణకు ప్రతినెల కేంద్రం నిధులు అందిస్తుంది.

ప్రతిరోజు 4 కేసులు

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కుక్క కాటు కేసులు రోజుకు దాదాపు 4 వరకు నమోదవుతున్నాయి. 2024లో 1,355 కేసులు నమోదు కాగా రోజుకు సగటు కుక్కకాటుకు గురైన వారి సంఖ్య 3.76గా ఉంది. 2025లో సెప్టెంబర్‌ నాటికి 1,040 కేసులు నమోదయ్యాయి. రోజుకు సగటు 3.85గా ఉంది. ఈ లెక్కలను బట్టి శేరిలింగంపల్లిలో కుక్కకాటుకు గురయ్యే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని అర్థమవుతోంది. గత ఫిబ్రవరిలో అత్యధికంగా 128, సెప్టెంబర్‌లో అత్యల్పంగా 103 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. శేరిలింగంపల్లి నియోజకర్గంతో పాటు పటాన్‌చెరు, కూకట్‌పల్లి, రాజేంద్రనగర్‌ నుంచి కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రికి రోగులు వస్తుంటారు.

రేబిస్‌ సోకితే మరణమే..

రేబిస్‌ వైరస్‌ అనేది న్యూరోట్రోపిక్‌ వైరస్‌. కుక్కతో పాటు ఇతర జంతువుల లాలజలం నుంచి వ్యాప్తి చెందుతుంది. రేబిస్‌ వైరస్‌ ఉన్న కుక్క కరిచిన వారిలో జలుబుతో మొదలై జ్వరం, తలనొప్పి, గాయం వద్ద ముడతలు, దురద ఉంటుంది. సెరిబ్రల్‌ పని చేయకపోవడంతో తీవ్ర గందరగోళం, ఆందోళన లక్షణాలకు దారి తీస్తుంది. వ్యాధి మరింత ముదిరితే మతి మరుపు, అసాధారణ ప్రవర్తన, నిద్రలేమి, ఆహారం తీసుకోకపోవడం లాంటి తీవ్ర ప్రభావాలకు లోనవుతారు. రెండు వారాల్లోనే మరణిస్తారు. రేబిస్‌ సోకిన రోగులకు కేవలం నల్లకుంటలోని ఫీవర్‌ ఆస్పత్రిలోని ఐసోలేషన్‌లో ఉంచుతారు.

ప్రతిపాదనలు అందాయి



యాంటి రేబిస్‌ క్లీనిక్‌ ఏర్పాటు చేయాలని వైద్యావిధాన పరిషత్‌ ఉన్నతాధికారుల నుంచి ప్రతిపాదనలు అందాయి. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కుక్క కాటు కేసులు ఎక్కువగా ఉన్న జిల్లాలను పైలెట్‌ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఉన్నతాధికారులు కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రిని సందర్శించిన అనంతరం యాంటి రేబిస్‌ క్లీనిక్‌ ఏర్పాటు ప్రక్రియ మొదలు కానున్నది. సాధారణ రోగులతో సంబంధం లేకుండా క్లీనిక్‌కు ప్రత్యేక ద్వారం, ఏర్పాట్లు, ఇంజక్షన్‌ రూమ్‌, సిబ్బంది అందుబాటులో ఉంటారు. కుక్క కాటుకు గురైన వారు ఆలస్యం చేయకుండా ఏఆర్‌వీ(యాంటి రేబిస్‌ వ్యాక్సిన్‌) తీసుకోవాలి. వీధి కుక్కలకు దూరంగా ఉంటే మంచిది.

– కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ చంద్రకృష్ణ

క్లుప్తంగా

కొండాపూర్‌ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం


శిబిరంలో కమాండెంట్‌ రామకృష్ణ తదితరులు

గచ్చిబౌలి: కొండాపూర్‌ బెటాలియన్‌లో నిమ్స్‌ ఆస్పత్రి వైద్యులు మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్‌ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందన్నారు. అనంతరం రక్తదానం చేసిన బెటాలియన్‌ అధికారులు, సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమాండెంట్లు నాగభూషణం, రవి చంద్ర, రహేమాన్‌, సత్యనారాయణ, పార్థసారథి, ఎస్‌ రాంబాబు, యూనిట్‌ మెడికల్‌ ఆఫీసర్‌ జ్యోతి బాపూలే పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి


అవగాహన కల్పిస్తున్న చంద్రిక

మియాపూర్‌: ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ మహిళా అధ్యక్షురాలు చంద్రికాప్రసాద్‌ గౌడ్‌ పిలుపునిచ్చారు. ఎంఏనగర్‌, వడ్డెర బస్తీ న్యూ కాలనీల్లో మహిళా నాయకురాళ్లతో కలిసి మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ ఓటుచోరీపై అవగాహన, సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకురాలు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

ఎక్సైజ్‌ సీఐ పరమేశ్వర్‌ గౌడ్‌

పటాన్‌చెరుటౌన్‌: పటాన్‌చెరు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో వివిధ గంజాయి కేసులో పట్టుపడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఎక్సైజ్‌ సీఐ పరమేశ్వర్‌ గౌడ్‌ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్‌ ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ మెదక్‌ ఆదేశాల మేరకు జిల్లా మద్యనిషేధ అధికారి సమక్షంలో పటాన్‌చెరు ఎక్సైజ్‌స్టేషన్‌ ఆవరణలో బుధవారం ఉ.10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత దరవత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

నిషేధిత మత్తు పదార్థాల పట్టివేత

మియాపూర్‌: ఇంట్లో నిల్వ చేసిన నిషేధిత పదార్థాలను పట్టుకున్న ఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మార్తాండనగర్‌ కాలనీలో ఓ ఇంట్లో ఓపీఎం, పాప్పి అనే మత్తు పదార్థాలు ఉన్నాయని అందిన సమాచారం మేరకు ఎస్‌ఓటీ, మియాపూర్‌ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. రాజస్థాన్‌లోని బెక్నూర్‌కు చెందిన మణీరామ్‌ (42) నుంచి సుమారు 4.5 కేజీల ఓపీఎం, పాప్పి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఓటీ పోలీసులు నిందితుడిని మియాపూర్‌ పోలీసులకు అప్పగించగా వారు అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాలను ఎక్కడ..ఎవరి నుంచి తీసుకువచ్చాడు.. ఎక్కడ సప్లై చేస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ, జన్మభూమి కాలనీలో వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోయ కిషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీ చైర్మన్‌ గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ సీనియర్‌ నాయకుడు రఘునాథ్‌ రెడ్డితో కలిసి పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి గొప్ప వ్యక్తి అని సంస్కృతి, సాహిత్యంలో పేరెన్నిక గల కవి అని అన్నారు.

సన్మానించిన పీఏసీ చైర్మన్‌

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ఇటీవల విడుదల చేసిన గ్రూప్‌ 1 ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఎంపీడీవో ఉద్యోగానికి ఎంపికైన మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని మాతృశ్రీ నగర్‌ కాలనీకి చెందిన సిహెచ్‌. వి.ఎం. హేమంత్‌ను మంగళవారం పీఏసీ చైర్మన్‌ గాంధీ సన్మానించారు.

'మనూ' దూరవిద్య కోర్సుల ప్రవేశాల గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని దూర విద్య కోర్సుల ప్రవేశాల గడువును ఈనెల 13 వరకు పొడిగించినట్లు సెంటర్‌ ఫర్‌ డిస్టెన్స్‌, ఆన్‌లైన్‌ ఎడ్యుకేషన్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ మహ్మద్‌ రజౌల్లాఖాన్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 4 ఏళ్ల బీఏ(ఆనర్స్‌, బీకాం (ఆనర్స్‌), బీఎస్సీ (ఆనర్స్‌) కోర్సులు ప్రవేశపెడుతున్నామని పేర్కొన్నారు. దీంతో పాటు ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్‌, అరబిక్‌, చరిత్ర, ఇస్లామిక్‌ స్టడీస్‌, డిప్లొమో కోర్సులైన జర్నలిజం అండ్‌ మాస్‌ కమ్యూనికేషన్‌, టీచ్‌ ఇంగ్లీష్‌, ఎర్లీ చైల్డ్‌ హుడ్‌ కేర్‌ అండ్‌ ఎడ్యుకేషన్‌, స్కూల్‌ లీడర్‌షిప్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌, ఉర్దూ, సర్టిఫికెట్‌ కోర్సులైన ఫంక్షనల్‌ ఇంగ్లీష్‌, ఇంగ్లీష్‌ ద్వారా ఉర్దూలో ప్రావీణ్యం వంటి వాటిల్లో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు స్టూడెంట్‌ సపోర్ట్‌ యూనిట్‌ హెల్ప్‌లైన్‌ ఫోన్‌ నంబర్‌ 040-23008463 లేదా 040-23120600(ఎక్స్‌టెన్షన్‌ 2207,2208లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నవోదయ దరఖాస్తు గడువు ..

రాయదుర్గం: జవహర్‌ నవోదయ విద్యాలయంలో 9, 11 వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించినట్లు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డిజిల్లా ప్రిన్సిపాల్‌ విజయ భాస్కర్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని వర్గాల నుంచి వచ్చిన వినతిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఈనెల 21 వరకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అంతేగాకుండా కరెక్షన్‌ విండో కూడా 22 నుంచి 25 వరకు ఛాన్స్‌ ఉందని ఇప్పటికే రిజిస్టర్‌ చేసుకున్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో పరిశీలించాలని, రంగారెడ్డి, వికారాబాద్‌, మేడ్చల్‌ జిల్లాలకు చెందిన అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా 'ఇబ్తిడా-2025' వేడుకలు



క్రీడల్లో తలపడుతున్న విద్యార్థులు

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్‌ డిజైన్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌ హైదరాబాద్‌ (ఎఫ్‌డీడీఐ-హెచ్‌ క్యాంపస్‌) లో 'ఇబ్తిడా-2025' పేరిట మంగళవారం క్రీడోత్సవాలను నిర్వహించారు. ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎన్‌ తేజ్‌లోహిత్‌రెడ్డి సమక్షంలో పంకజ్‌దివాన్‌, రామకృష్ణ, భవానీ కేడీయాతో కలిసి ప్రారంభించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు క్రీడలతో పాటు సాంస్కృతిక, కళాత్మక పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈడీ డాక్టర్‌ ఎన్‌తేజ్‌లోహిత్‌ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా సాంస్కృతిక, కళాత్మక నైపుణ్యాలను వెలికి తీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శిక్షణ తీసుకుంటున్న పోలీసులతో అదనపు డీజీపీ మహేశ్‌ భగవత్‌, నిథమ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వెంకటరమణ

'టూరిజం పోలీస్‌'లకు ప్రత్యేక శిక్షణ

- గచ్చిబౌలిలోని 'నిథమ్‌'లో నిర్వహణ
- మొదటి బ్యాచ్‌లో 80 మందికి మరూ


శిక్షణలో టూరిజం పోలీసులు

రాయదుర్గం: పోలీస్‌ అనగానే సివిల్‌, ట్రాఫిక్‌, స్పెషల్‌ ఇలా.. రకరకాల పోలీసు విభాగంలో పని చేస్తుంటారని మనకు తెలుసు. కానీ తెలంగాణలో మొదటిసారిగా 'టూరిజం పోలీస్‌' పేరిట ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి విడతలో 80 మంది పోలీస్‌ సిబ్బందిని నియమించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం 'ఓరియంటేషన్‌ అండ్‌ సెన్సిటైజేషన్‌ ఆఫ్‌ టూరిస్ట్‌ పోలీస్‌' అనే పేరిట గచ్చిబౌలిలోని 'నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజం అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ (నిథమ్‌)లో శిక్షణ తలపెట్టారు. నిథమ్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ వి. వెంకటరమణ పర్యవేక్షణలో నిథమ్‌ ఫ్యాకల్టీ, ఇతర నిష్ణాతుల సహకారంతో చేపట్టిన శిక్షణా శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) మహేశ్‌ భగవత్‌ ప్రారంభించిన విషయం తెలిసిందే.

సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్‌ : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ పేర్కొన్నారు. స్టాలిన్‌నగర్‌ కాలనీకి చెందిన పలువురు మైనార్టీ నాయకులు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, పలు అభివృద్ధి పనులను చేపట్టాలని మంగళవారం ఆయన్ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులు త్వరగా చేపట్టేలా చూస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మోహిన్‌, యూసఫ్‌, ఫిరోజ్‌, తౌసీప్‌ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్‌ శ్రీకాంత్‌తో మైనార్టీ నాయకులు

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని స్వాన్‌లేక్‌ అపార్టుమెంట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయం ప్రథమ వార్షికోత్సవం వేడుకలు బుధవారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు స్వాన్‌లేక్‌ అపార్టుమెంట్స్‌ దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. 8న ఉదయం 8 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, అంకురారోహణం, అఖండ దీపారాధన, ఋత్విక్‌ వరణము, పంచగవ్యపాసన, యాగశాల ప్రవేశము, నవగ్రహ, వాస్తు క్షేత్రపాల, యోగిని బ్రహ్మాది మండల స్థాపనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమంతో ప్రారంభమవుతాయని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ


పనులను పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ, అధికారులు

ఆల్విన్‌కాలనీ: రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఉషా ముళ్లపూడి కమాన్‌ నుంచి గాజుల రామారం వరకు చేపడుతున్న 100 ఫీటల్ల రోడ్డు విస్తరణ పనులను ఇంజినీరింగ్‌, విద్యుత్‌, అర్బన్‌ బయోడైవర్సిటీ విభాగం అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉషా ముళ్లపూడి కమాన్‌ నుంచి గాజులరామారం వెళ్లే ఎల్లమ్మబండ రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్‌ సమస్య పరిష్కారానికి 100 ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టడం జరిగిందన్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్‌ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్‌ విభాగం ఈఈ గోవర్ధన్‌, ఏఈ శ్రావణి, ఏఈ నిఖిల్‌, విద్యుత్‌ విభాగం అధికారులు డీఈ జనప్రియ, ఏడీఈ ప్రసాద్‌, శ్యామ్‌, ఏఈ చైతన్య, యూబీడీ డిప్యూటి డైరెక్టర్‌ శివ జ్యోతి, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో. టమాట రూ. 30, పచ్చిమిర్చి 50 , బెండ 50, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 60, వంకాయ 60, గోకర 80, బీన్స్‌ 90, బీట్‌రూట్‌ 50, క్యాప్సికం 60, క్యాబేజీ 30, క్యారెట్‌ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 30, అల్లం 110, వెల్లుల్లి 150.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలి


సామ రామ్మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న అభిషేక్‌గౌడ్‌

రాయదుర్గం: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్‌ మీడియా అండ్‌ కమ్యూనికేషన్స్‌ చైర్మన్‌ సామ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీకృష్ణయూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం మల్కంచెరువు వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్లు ధరించాలని, కారులో వెళ్లేవారు సీటు బెల్ట్‌ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్‌, జిల్లా కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి అభిషేక్‌గౌడ్‌, రోహిత్‌ గౌడ్‌, గచ్చిబౌలి అధ్యక్షుడు భరత్‌గౌడ్‌, సురేశ్‌గౌడ్‌, శశాంక్‌ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో కార్పొరేటర్‌ పర్యటన


విద్యుత్‌ శాఖ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్‌

కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌

పటాన్‌చెరు టౌన్‌: డివిజన్‌లో విద్యుత్‌ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌యాదవ్‌ అన్నారు. మంగళవారం డివిజన్‌ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్‌ కాలనీలో పర్యటించి అక్కడ నెలకున్న విద్యుత్‌ లూస్‌లైన్లు, మిడిల్‌ పోల్స్‌ వంటి సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్‌ శాఖ సీజీఎం కామేశ్వర రావు, ఎస్‌ఈ శ్రీనాథ్‌ ,డీఈ భాస్కర్‌రావు, ఏడీఈ సంజీవ్‌, ఏఈ జగదీశ్‌, లైన్‌మెన్‌లు కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సమస్యల పరిష్కారానికే బస్తీబాట


అధికారులను సన్మానిస్తున్న కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, తులసీనగర్‌లో ఎలక్ట్రికల్‌ అధికారులు ప్రజా సమస్యలపై మంగళవారం బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ రెడ్డి కాలనీలో నెలకొన్న విద్యుత్‌ సమస్యలపై అధికారులకు వివరించారు. ముఖ్యంగా వంగిపోయిన విద్యుత్‌ స్తంభాలు, అతుకులతో కూడిన విద్యుత్‌ వైర్లు, లో ఓల్టేజ్‌ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్‌ సమస్యలను వివరించారు. సమస్యలను సానుకూలంగా విన్న అధికారులు ప్రణాళికాబద్ధంగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ నాయక్‌, లైన్‌మెన్లు వెంకటేశ్వరరావు, రమేష్‌, కాలనీ వాసులు సిద్ధారెడ్డి, శ్రీనివాస్‌, బుచ్చిబాబు, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్యాచ్‌ వర్కు పనుల పరిశీలన


రోడ్డు ప్యాచ్‌ వర్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీ బస్టాప్‌ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంతలు పడింది. ప్యాచ్‌ వర్కు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గుంతలు పడిందని, దీనివల్ల వాహనదారులు కిందపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీ అసోసియేషన్‌ సభ్యుల సమాచారం మేరకు రోడ్డు ప్యాచ్‌ వర్కు పనులు చేపట్టామని తెలిపారు. అదే విధంగా పలు కాలనీలలో ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు, తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్‌ మహదేవ్‌, సిబ్బంది, కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.